సంపుటి : 9
సంచిక : 340
మంగళవారం
01 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్


10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
Contact For Ads:
7579339999



## కరవు నేలపై
# కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర

- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం
- నాడు పునాది వేసిన తానే నేడు ప్రారంభించడం అదృష్టమన్న సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వం ఫేక్ ప్రారంభోత్సవంతో ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శ
- 2028 నాటికి రెండో దశ పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా ఇస్తామని హామీ
- నదుల అనుసంధానంతోనే దేశంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**ఒంగోలు రూరల్, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** వెలిగొండ బంగారు కొండ అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలంలో వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను జాతికి అంకితం చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. "మాట ఇచ్చాను.. నిలబెట్టుకున్నాను. పునాది వేశాను.. ప్రాజెక్టును పూర్తి చేశానని సగర్వంగా చెబుతున్నాను. ఇది నా అదృష్టం. 30 ఏళ్ల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశాను. 30 ఏళ్ల తర్వాత మొదటి దశ ప్రారంభించి జాతికి అంకితం చేశాను. నాడు చేసిన సంకల్పం.. నేడు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం.. కొండలు వస్తే తొలిచి ముందుకెళ్లాం. ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన ప్రజలకు పాదాభివందనం చేస్తున్నాను. నిర్వాసితులు కూడా సంతోషంగా ఉండాలనేది నా ఆకాంక్ష. ఆర్థికంగా కష్టాలున్నా.. ఎక్కడా వెనకడుగు వేయలేదు. వాన కోసం ఆకాశం వైపు చూసిన రైతుల బాధలు చూశాం. బోరు వేస్తే నీళ్లు పడక అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబాలను చూశాం. పనులు దొరక్క ఊరు విడిచి వెళ్లిన కూలీలను చూశాం. ఇక ఆ పరిస్థితులు ఉండవు. ఫ్లోరైడ్ అనే పదం మరచిపోతాం. 2019లో గొడ్డలి పార్టీ రాకతో



వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టింది. 2024లో వెలిగొండకు పట్టిన గ్రహణం వీడింది. గత ప్రభుత్వంలో కేవలం 2.77 శాతమే పనులు చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి చెల్లింపులతో మోసం చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశామని డ్రామాలాడారు. ఫేక్ ప్రచారాలతో కరవు రైతుల జీవితాలతో ఆడుకున్నవారిని ఏమనాలి? ప్రధాని మోదీ సాయం.. మిత్రుడు పవన్ సహకారంతో ముందుకెళ్తున్నాం. కరవుతో పోరాడిన రైతన్నకు కృష్ణా జలాలతో స్వాగతం పలికాం. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టానికి ముగింపు. వెలిగొండ బంగారు మిగతా .. 2లో..

## పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ..
# ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ



**ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ ప్రధాని నరేంద్ర మోదీ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు కిర్గిస్థాన్‌లో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత ప్రధాని మోదీ ఇరాన్ అధ్యక్షుడిని కలవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ సమావేశంలో యుద్ధం ముగింపు, హర్మూజ్ జలసంధి దిగ్బంధనం వంటి కీలక అంశాలపై చర్చించారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పే లక్ష్యంతో చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఉంటుందని మోదీ హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇరుదేశాల మధ్య వాణిజ్య పరిధిని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. తమ దేశంపై అమెరికా మిగతా .. 2లో..

## జగన్ ఎన్ని కుట్రలు చేసినా
# స్థానిక సంస్థల ఎన్నికలు ఆగవు

### మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** బీసీ రిజర్వేషన్లు, ఓటర్ల జాబితాపై కేసులు వేస్తుండటంపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైకాపా అధినేత జగన్ ఎన్ని కుట్రలు పన్నినా స్థానిక సంస్థల ఎన్నికలు మిగతా .. 2లో..

## మెస్సీ శకం
# ముగిసింది

### అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్



**ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆ లెజెండ్, ఇకపై దేశం తరఫున బరిలోకి దిగనని సోమవారం (ఆగస్టు 31) సంచలన ప్రకటన చేశాడు. ఈ మేరకు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగ లేఖను పోస్ట్ చేశాడు. 2026 ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచే రిటైర్మెంట్ ఆలోచనలో ఉన్నానని, తన తండ్రి మరణం ఆ నిర్ణయాన్ని మరింత బలపరిచిందని మెస్సీ ఆ లేఖలో పేర్కొన్నాడు. మెస్సీ వీడ్కోలు వార్త మిగతా .. 2లో..

# ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

### హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ - ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనం ప్రారంభం జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌కు ప్రారంభోత్సవం - విశాఖలో పర్యటనలో మంత్రి నారా లోకేష్

**విశాఖపట్నం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** "ఒక వ్యక్తి చేసిన దానం.. నేడు వేల మందికి నీడనిచ్చే మహావృక్షంగా మారింది. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ ప్రాంగణమే ఒక చక్కటి ఉదాహరణ" అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇవాళ విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో ఆయన పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి



పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని, ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను మిగతా .. 2లో..

## పరిశ్రమలన్నీ 33 శాతం
# పచ్చదనాన్ని పాటించాలి

### డిప్యూటీ సీఎం, అటవీ, పర్యావరణశాఖల మంత్రి పవన్



**అమరావతి, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం, అటవీ, పర్యావరణశాఖల మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పరిశ్రమలన్నీ పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, మిగతా .. 2లో..

## కేసీఆర్ కోసం ఇప్పటివరకు
# రూ.21 కోట్ల ఖర్చు : సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికాబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించి అనంతరం మాట్లాడారు. "అంబర్‌పేటలో ఏ ప్రభుత్వ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయింది? మేం రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడున్న వాళ్లకు ఎలా ఉపయోగపడతాయి? అంబర్




పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి మిగతా .. 2లో..

# విజయ్.. ఐరాస చీఫ్ కూడా అవుతారేమో.. : డీఎంకే



**తమిళనాడు, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు సీఎం విజయ్‌ను 2029 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా టీవీకే పార్టీ ప్రచారం చేస్తుండడం అక్కడి రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రచారాలపై ప్రతిపక్ష డీఎంకే పార్టీ విమర్శలు గుప్పిస్తుండగా.. మిత్రపక్షమైన కాంగ్రెస్ సైతం వ్యతిరేకిస్తోంది. అసలేమైందంటే? టీవీకే సీనియర్ నేత, రెవెన్యూశాఖ మంత్రి కె.ఎ.సెంగోట్టైయన్ ఇటీవల తిరుప్పూర్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ తాను ఎంజీఆర్, జయలలితతో కలిసి పనిచేశానని, విజయ్ వారికి మించిన శక్తిగా ఉన్నారంటూ కొనియాడారు. ఆయన తమిళనాడుకే పరిమితం కారని, దేశాన్ని సైతం పాలిస్తారని వ్యాఖ్యానించారు. ఇటీవల టీవీకే చేసిన ఓ సర్వేలోనూ మోదీ, రాహుల్ గాంధీ తర్వాత ప్రధాని అయ్యే అవకాశం విజయ్‌కు ఉందని తేలింది. దీంతో టీవీకే నేతలు విజయ్‌ను భావి ప్రధానిగా అభివర్ణిస్తున్నారు. దీనిపై డీఎంకే కార్యదర్శి భారతి స్పందిస్తూ.. ఊహించుకోవడానికి హద్దుల్లేవు గనక వారు ఏమైనా అనుకుంటారంటూ విమర్శలు మిగతా .. 2లో..




## సింధు జలాలపై తీర్పు..
# కోర్టుకు ఆ పరిధిలేదన్న భారత్



**ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** సింధు జలాల ఒప్పందంపై ప్రపంచ బ్యాంక్ ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కోర్టు ఇచ్చిన తీర్పును భారత్ తోసిపుచ్చింది. ఈ న్యాయస్థానం చట్టవిరుద్ధంగా ఏర్పాటైనదిగా పేర్కొంది. సింధు జలాల ఒప్పందం తాత్కాలిక నిలుపుదల కొనసాగుతుందని స్పష్టంచేసింది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం సింధు జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రపంచ బ్యాంక్ ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడానికి న్యూఢిల్లీ చెప్పిన కారణం సహేతుకంగా, మిగతా .. 2లో..

## ఏపీ మద్యం అక్రమ రవాణా కేసు..
# సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం



**ఢిల్లీ, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో మద్యం అక్రమ రవాణా కేసులో సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రెండేళ్లుగా కేసు నడుస్తోందని, ఇంతవరకు ఏం కనుగొనలేదని పేర్కొంది. ముందుగా సిట్ తీరును ఎగ్జామిన్ చేసి.. ఆ తర్వాత హైకోర్టు తీర్పును పరిశీలిస్తామని తెలిపింది. రాజ్ కెసిరెడ్డి కేసులో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. రాజ్‌కెసిరెడ్డి పోలీస్ కస్టడీపై నిజంగానే మిగతా .. 2లో..

## జలవనరుల జియోట్యాగింగ్ ద్వారా
# పారదర్శకత : ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర జల్‌శక్తి శాఖ సెప్టెంబర్ 1 నుంచి దిల్లీలో నిర్వహించనున్న సదస్సులో తెలంగాణ సమగ్ర జలభద్రత నమూనాను వివరించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా సుస్థిర జలవనరుల నిర్వహణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో దిల్లీలోని భారత్ మండపంలో మంగళ, బుధవారాల్లో జాతీయ సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సదస్సులో రాష్ట్రం మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర

కొండ అవుతుంది. కరవుపై గెలవాలన్న సంకల్పంతో ముందడుగు వేశాం. కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర ఇది. 2024 ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్, నేనూ కలిసి రాష్ట్ర పునర్నిర్మాణంపై మాట ఇచ్చాం. మాపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యమిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల రాష్ట్రానికి అన్నీ ప్రయోజనాలే.

**నీటి సమస్యకు పరిష్కారం.. నదుల అనుసంధానం..**

చేతగాకపోతే తప్పు లేదు.. చేశామని మోసం చేస్తేనే పెద్ద తప్పు. ఫేక్ మాటలు చెప్పేవారిని నిలదీయకపోతే అవే వాస్తవాలు అనుకుంటారు. ఆవేదనతో చెబుతున్నా.. ఫేక్ మాటలను సమర్థంగా తిప్పికొట్టాలి. నీటి సమస్యకు ఏకైక పరిష్కార మార్గం.. నదుల అనుసంధానం. నదుల అనుసంధానం జరగాలంటే.. ప్రధాని మోదీకే సాధ్యం. పోలవరం రాష్ట్రానికే జీవనాడి. పోలవరాన్ని 2027 మార్చి నాటికి పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. రాబోయే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలో కూడా చేసుకోబోతున్నాం. గోదావరి నీళ్లు కూడా నల్లమలసాగర్‌కు రావాలి. ఉత్తర భారత్‌లో నదుల అనుసంధానానికి అనేక సమస్యలు పరిష్కరించారు. దక్షిణ భారత్‌లో కూడా గోదావరి, కావేరి అనుసంధానం చేయాలి. గోదావరి నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. వృథాగా వెళ్లే నీటిని దారిమళ్లిస్తే సంపద సృష్టించొచ్చు. నదుల అనుసంధానంతో దేశం సుభిక్షంగా ఉంటుంది. ఎల్లుండే పోలవరం ఎడమకాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్తున్నాం. ప్రతి నీటిబొట్టును భూగర్భ జలాలుగా మార్చుకోవాలి. నదుల అనుసంధానం జరిగితేనే మంచి భవిష్యత్తు ఉంటుంది. నల్లమలసాగర్ నుంచి ప్రతిఇంటికి కుళాయి ద్వారా నీరిస్తాం. రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్ట్‌లో మార్కాపురాన్ని భాగం చేశాం. వెనుకబడిన ఈ ప్రాంతం పొరుగు జిల్లాలకు పోటీగా నిలుస్తుంది. వెలిగొండ తొలి దశతో ఆగము.. ఫేజ్ 2 కూడా 2028 నాటికి పూర్తి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రకు అందరూ సిద్ధమని సంకల్పించాలి. నాకు రాజకీయం అంటే ఎన్నికలు కాదు.. ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తా. నెక్స్ట్ ఎన్నికల కోసం కాదు.. నెక్స్ట్ జనరేషన్ కోసం పనిచేస్తా. నా ఊపిరి ఉన్నంత వరకు తెలుగు జాతి కోసం కష్టపడతా. అందరం కలిసి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ చేదాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు..**

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల కల సాకారమైంది. పశ్చిమ ప్రకాశంలోని కరవు పీడిత ప్రాంతాలకు జీవనాడిగా భావిస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద ప్రాజెక్టు సొరంగాల నుంచి ఉరకలేస్తూ వచ్చిన కృష్ణా జలాలకు ఆయన భక్తిశ్రద్ధలతో జలహారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ చారిత్రక ఘట్టంతో ఆ ప్రాంత రైతులు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ సందర్భంగా గంటవానిపల్లె ఫీడర్ కెనాల్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్వయంగా నీళ్లలోకి దిగి కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర సమర్పించి హారతి ఇచ్చారు. అంతకుముందు, జలహారతి ప్రదేశానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి గిరిజన మహిళలు తమ సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పండితులు ముఖ్యమంత్రికి శ్రీశైలం మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు. నల్లమల కొండలను తొలుచుకుంటూ నిర్మించిన రెండు భారీ సొరంగాల నుంచి కృష్ణా జలాలు గంటవానిపల్లె ఆక్విడెక్టుకు చేరుకుని, అక్కడి నుంచి నల్లమల సాగర్ రిజర్వాయర్‌లోకి పరుగులు తీశాయి. ఈ దృశ్యాన్ని సభా ప్రాంగణం నుంచి వీక్షించిన మార్కాపురం రైతులు, మహిళలు పులకించిపోయారు. తమ ప్రాంతానికి కృష్ణమ్మ రావడంతో వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. ఈ చారిత్రక కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, డీబీవీ స్వామి, అనగాని సత్యప్రసాద్, పార్థసారధి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దశాబ్దాల నిరీక్షణకు కూటమి ప్రభుత్వం తెరదించిందని, ఇచ్చిన మాట ప్రకారం వెలిగొండను పూర్తి చేసిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ

దురాక్రమణకు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టేందుకు పెజెష్కియన్ ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము యుద్ధాన్ని కోరుకోవట్లేదన్నారు. 'చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం. కానీ మాపై దురాక్రమణను మాత్రం సహించబోం. బలంతో, దృఢ నిశ్చయంతో ప్రతిస్పందిస్తాం. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలకు కూడా హానికరం. అదే సమయంలో ఆర్థిక, భద్రతా లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రపంచదేశాల మధ్య సమన్వయం అవసరం. ఈ సమావేశం చాలా ముఖ్యమైనది. అనేక దేశాల అధినేతలు ఇందులో పాల్గొంటారు. కొన్ని అంతర్జాతీయ సంస్థలు ప్రపంచంలో తమ గుత్తాధిపత్యాన్ని చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ సమయంలో ప్రపంచ వేదికపై మన ఉనికిని, విభిన్నమైన, స్వతంత్ర స్వరాలను వినిపించడానికి ఇది దోహదపడుతోంది' అని పెజెష్కియాన్ పేర్కొన్నారు. ఈ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ (గ్జీ జిన్‌పింగ్), అర్మేనియా ప్రధానమంత్రి నికోల్ పాషిన్యాన్‌ను కూడా కలిశారు. రక్షణ, ఆర్థిక, ఫార్మా, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా పలు రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. అలాగే, మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు ఆగవు

ఆగవన్నారు. పాత ఓటర్ల జాబితా ప్రకారమే ఎన్నికలకు వెళ్లనున్నట్లు చెప్పారు. ధైర్యం ఉంటే పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. స్థానిక ఎన్నికల విషయంలో జగన్‌ది ద్వంద్వ వైఖరి అని దుయ్యబట్టారు. ఏకగ్రీవాలను కూడా అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఆయన ఎన్ని కుట్రలు చేసినా తమను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నరన్నారు. రాష్ట్రంలోని అన్ని నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు.

# మెస్సీ శకం ముగిసింది

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

**భావోద్వేగ లేఖలో మెస్సీ ఏమన్నాడంటే?**

"ఫైనల్ ముగిసినప్పటి నుంచి సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాత, నేను జాతీయ జట్టు నుంచి రిటైర్ అవుతున్నానని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను" అని మెస్సీ తన ప్రకటనను ప్రారంభించాడు. తన కెరీర్ ఆద్యంతం అర్జెంటీనా అభిమానులతో, జాతీయ జట్టుతో పెనవేసుకున్న అనుబంధం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపాడు. "ఈ నిర్ణయం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. కానీ, ఇదే సరైన సమయమని నేను అర్థం చేసుకున్నాను. నా దేశం కోసం నేను ఎప్పుడూ సర్వస్వం ఇచ్చానని ప్రమాణం చేస్తున్నాను. కేవలం గెలిచిన మ్యాచ్ లలోనే కాదు, అంతకుముందు కూడా ఈ జెర్సీ కోసం నేను ఎప్పుడూ పోరాడాను, నా సర్వశక్తులు ఒడ్డాను. ఫుట్‌బాల్ ద్వారా మీకు ఆనందాన్ని పంచడానికి, అర్జెంటీనా పౌరుడిగా మీరు గర్వపడేలా చేయడానికి ప్రయత్నించాను" అని భావోద్వేగంగా రాసుకొచ్చాడు. తన రిటైర్మెంట్ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణాలను మెస్సీ స్పష్టంగా వివరించాడు. జూలైలో జరిగిన 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌పై అర్జెంటీనా ఓటమి పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపాడు. ఆ ఓటమి తర్వాత రెండు రోజులకే, అంటే జూలై 21నే తాను ఈ వీడ్కోలు లేఖను రాసుకున్నట్లు వెల్లడించాడు. అయితే, ఇటీవల మా నాన్న మరణం తర్వాత, ఇక కొనసాగలేనన్న నమ్మకం బలపడింది" అని పేర్కొన్నాడు. మెస్సీకి తండ్రి జార్జ్ మెస్సీనే ఏజెంట్‌గా వ్యవహరించారు. సుదీర్ఘ అనారోగ్యంతో ఆగస్టు 8న మరణించిన విషయం తెలిసిందే. కాలం గడిచిపోవడం, కొత్త తరం క్రీడాకారులు జట్టులోకి రావడం కూడా తన నిర్ణయానికి ఒక కారణమని మెస్సీ వివరించాడు. "నాకు మిగిలింది తక్కువ సమయమే. నా జీవితంలో కొన్ని అధ్యాయాలు ముగింపు దశకు వస్తున్నాయి. అందులో ఇది ఒకటి. ఇది నన్ను చాలా బాధిస్తోంది. నేను జాతీయ జట్టులో భాగమవ్వడాన్ని ప్రేమించాను, ప్రేమిస్తున్నాను, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశాను. ఇక ఇవ్వడానికి ఏమీ మిగల్లేదు. అంతేకాకుండా, అద్భుతమైన యువ క్రీడాకారులు వస్తున్నారు. వారికి అవకాశం దక్కాలి" అని పేర్కొన్నాడు. రెండు దశాబ్దాల తన అంతర్జాతీయ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన అభిమానులకు మెస్సీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. "గడిచిన 20 ఏళ్ళుగా మీరు చూపించిన ప్రేమకు, మద్దతుకు ధన్యవాదాలు. స్టేడియం లోపలి నుంచి మీ కేరింతలను నేను చాలా మిస్ అవుతాను. ఇకపై నేను కూడా మీలో ఒకడిగా, మంచి చెడు సమయాల్లో, ముఖ్యంగా కష్టకాలంలో బయటి నుంచి జట్టుకు మద్దతు ఇస్తాను" అని తెలిపాడు. తన ఈ సుదీర్ఘ ప్రయాణంలో తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులకు, కోచ్‌లకు, సహచర ఆటగాళ్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపాడు. "ఈ అందమైన, అదే సమయంలో కఠినమైన ప్రయాణంలో నాతో పాటు ఉన్న నా కుటుంబానికి ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి కోచ్, సహచరుడు, అధికారికి నా కృతజ్ఞతలు. ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకాలను, క్షణాలను నాతో పాటు తీసుకువెళుతున్నాను" అని పేర్కొన్నాడు. జట్టు సభ్యులతో కలిసి దేశం కోసం సాధించిన విజయాలపై గర్వంగా, సంతృప్తిగా ఉన్నానని మెస్సీ తెలిపాడు. "నా సహచరులతో కలిసి, మనం కలలు మాత్రమే కనగలిగే క్షణాలను మీకు అందించామన్న గర్వంతో, మనశ్శాంతితో నేను వెళ్ళిపోతున్నాను. మీతో కలిసి ఆ అనుభూతిని పొందడం ఒక అద్భుతం. ఐ లవ్ యూ! నన్ను అర్జెంటీనా వాడిగా పుట్టించినందుకు దేవుడికి ధన్యవాదాలు. లెట్స్ గో, అర్జెంటీనా!" అంటూ తన లేఖను ముగించాడు. 2005లో అర్జెంటీనా సీనియర్ జట్టులోకి అరంగేట్రం చేసిన మెస్సీ, 207 మ్యాచ్‌లతో దేశం తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 125 గోల్స్ సాధించాడు. తన కెరీర్‌లో 2022లో ప్రపంచకప్ విజయం, రెండు కోపా అమెరికా టైటిళ్లు వంటి శిఖరాలను అధిరోహించడంతో పాటు, 2014, 2026 ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఓటముల వంటి బాధాకరమైన క్షణాలను కూడా చవిచూశాడు. అతడి అంతర్జాతీయ కెరీర్ ముగిసినప్పటికీ, క్లబ్ ఫుట్‌బాల్‌లో మాత్రం కొనసాగనున్నారు. 2028 వరకు కాంట్రాక్ట్ ఉన్న ఇంటర్ మయామి జట్టు తరఫున ఆయన ఆడటం కొనసాగిస్తాడు. మెస్సీ వీడ్కోలుతో అర్జెంటీనా ఫుట్‌బాల్‌లో ఒక స్వర్ణయుగం ముగిసినట్లయింది.

# ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థకు సహకరిస్తున్న ముఖ్య దాతలతో బోర్డ్‌రూమ్ సమావేశంలో పాల్గొన్నారు.

**సేవే పరమావధిగా సాగిన జీవితం**

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ దివంగత 'పద్మశ్రీ' డాక్టర్ ఎస్.వి. ఆదినారాయణరావు గారు, వారి కుటుంబం సమాజ సేవ కోసం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆ భూమిలో నేడు కాలేజీ, హరేకృష్ణ మిషన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం, వృద్ధుల సంరక్షణ కేంద్రం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కొనియాడారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్న ఈ రోజుల్లో, వృద్ధుల కోసం అత్యాధునిక కేర్ సెంటర్ నిర్మించడం గొప్ప విషయమని ప్రశంసించారు.

**విలువలతో కూడిన విద్యే లక్ష్యం**

"విద్యాశాఖ మంత్రిగా విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా, విలువలు, నైతికతతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత నాపై ఉంది. 'అమ్మకి చెప్పలేని పని ఏదీ చేయొద్దు' అనే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి మాట ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం కావాలి. అందుకే ఆయనకు కేబినెట్ హోదాతో సలహాదారు బాధ్యతలు అప్పగించాం. ఆయన సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన పుస్తకాలను అందిస్తాం" అని లోకేశ్ వివరించారు. వృద్ధులు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి రూ.4,000 పెన్షన్ అందిస్తున్నారని గుర్తు చేశారు.

**విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "రాష్ట్ర విభజన తర్వాత విశాఖ అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లుగా విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో విశాఖను దేశంలోనే నంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేసిన తరహాలోనే విశాఖ అభివృద్ధిలోనూ కొత్త బెంచ్‌మార్క్ సృష్టిస్తామని అన్నారు.

**అపోహలు వద్దు.. పర్యావరణ పరిరక్షణే ముఖ్యం**

అభివృద్ధి విషయంలో ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని లోకేశ్ అన్నారు. "ప్రజల ప్రయోజనాలకు, ప్రకృతికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేపట్టదు. డేటా సెంటర్ల విషయంలో కొన్ని అపోహలున్నాయి. నేను వ్యక్తిగతంగా ఇంటెల్ డేటా సెంటర్‌ను పరిశీలించాను. విశాఖలో ఏర్పాటు చేసే డేటా సెంటర్లలో నీటి వినియోగాన్ని తగ్గించే ఎయిర్ కూలింగ్ వంటి ఆధునిక సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తాం" అని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అన్ని విషయాల్లో పర్ఫెక్ట్ అని చెప్పడం లేదని, ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, అవసరమైన చోట సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, ఫౌండేషన్ ఛైర్మన్ రొక్కమ్ శశి ప్రభ, హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిస్కించన భక్త దాస తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనాన్ని పాటించాలి

ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

# రూ.21 కోట్ల ఖర్చు : సీఎం రేవంత్‌రెడ్డి

ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితమైంది. ఎడ్ల సుధాకర్ మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ప్రజలు ఆలోచించాలి. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్కసారైనా ఒకటో తేదీన జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉంది.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలి.

**కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి**

ఉస్మానియా ఆసుపత్రిని 2 వేల పడకలతో కడుతున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభిస్తాం. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రిచెన్నారెడ్డి పేరు, అల్వాల్‌లో ఉన్న టిమ్స్‌కు టి.అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్‌లో ఉన్న టిమ్స్‌కు ప్రొ.జయశంకర్ పేరు పెడతాం. బ్రిటిష్ హయాంలో 1931లో కులగణన చేస్తే.. 100 ఏళ్లలో మళ్లీ కులగణన చేసేందుకు ఈ దేశంలో ఏ నాయకుడు ధైర్యం చేయలేదు. జనగణన, కులగణన చేస్తారా లేదా గద్దె దిగుతారా అని తెలంగాణ సమాజం ప్రధాని మోదీకి సవాల్ విసిరింది. కేసీఆర్ 1000 రోజుల్లో కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారు. మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఆయనకు ఇన్నిరోజులు సెక్యూరిటీ, ఇల్లు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసింది. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఆందోళనలు చేయాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# విజయ్.. ఐరాస చీఫ్ కూడా అవుతారేమో.. : డీఎంకే

గుప్పించారు. విజయ్‌ను ఐరాస అధిపతిని చేస్తామని కూడా అంటారేమో అని ఎద్దేవా చేశారు. టీవీకే ప్రచారాన్ని కాంగ్రెస్ సైతం తప్పుబట్టింది. 2029 ఎన్నికల్లో తమ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని అభ్యర్థిగా నిలబడతారని.. టీవీకే ఆయనకు మద్దతు ఇవ్వకపోతే తమిళనాడు మంత్రివర్గం నుంచి వైదొలుగుతామని సీనియర్ నేత మాణికం ఠాగూర్ హెచ్చరించారు. ప్రతి సర్వే ప్రజాభిప్రాయాలను ప్రతిబింబించదని పేర్కొన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల విషయంలో తమ పార్టీకి స్పష్టమైన ప్రణాళిక ఉందన్నారు. విజయ్‌కు మిత్రపక్షంగా ఉన్న ఎండీఎంకే సైతం ఈ వార్తలను వ్యతిరేకించింది. ఇండియా కూటమి తరఫున ప్రధాన మంత్రి అభ్యర్థిగా రాహుల్ గాంధీ మాత్రమే ఉంటారని తెలిపింది. ప్రధాని కావాలని విజయ్ ఆశిస్తారని కూడా తాము అనుకోవట్లేదని పేర్కొంది. ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేయొద్దని టీవీకే నేతలకు సూచించింది.

# కోర్టుకు ఆ పరిధిలేదన్న భారత్

రద్దుకు సమర్థనీయంగా లేదని పేర్కొంది. జలాల ఒప్పందం పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించింది. అలాగే, జమ్మూకశ్మీర్‌లో నిర్మిస్తున్న హైడ్రోఎలక్ట్రిక్ పనులపై పరిమితులు విధించింది. దీనిపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించింది. ఈ మధ్యవర్తిత్వ న్యాయస్థానం చట్టవిరుద్ధంగా ఏర్పాటైందని, భారత్ సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు చెప్పే అర్హత గానీ, అధికార పరిధి గానీ దానికి లేదని స్పష్టంచేసింది. ఈ కోర్టును మొదటి నుంచీ భారత్ గుర్తించలేదని, దాని విచారణలకు ఎప్పుడూ హాజరుకాలేదని తెలిపింది. కాబట్టి ఆ న్యాయస్థానం ఇచ్చే తీర్పులు ఏవీ చెల్లవని, భారత్ చేపట్టే ప్రాజెక్టులపై వాటి ప్రభావం ఉండదని తేల్చిచెప్పింది.

**ఏమిటీ ఒప్పందం?**

సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై 1960 సెప్టెంబరులో నాటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం సింధు ఉప నదుల్లో తూర్పున ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారతదేశానికి హక్కులు లభించాయి. సింధు నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ మద్దతు ఇస్తోందనే కారణంతో 2025 ఏప్రిల్‌లో భారతదేశం ఈ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఉగ్రవాదాన్ని శాశ్వతంగా అణచివేసే వరకు ఈ ఒప్పందం పునరుద్ధరణ ఉండదని భారత్ స్పష్టం చేసింది.

# సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం

సీరియస్‌గా ఉన్నారా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పెండింగ్‌లో ఉండగా ప్రొడక్షన్ వారెంట్ అడిగారని, అప్పటికే కస్టడీలో ఉన్న వ్యక్తి పారిపోయే అవకాశమే లేదని పేర్కొంది. కస్టోడియల్ ఇంటరాగేషన్ కోరితే.. జడ్జి మీకు ప్రొడక్షన్ వారెంట్ ఇచ్చారు కదా అని కోర్టు అడిగింది. పోలీసు కస్టడీకి ప్రిఫేర్ కాలేదు.. జ్యుడిషియల్ కస్టడీ ఇవ్వమంటున్నారు.. ఇదేం ప్రవర్తన అని ప్రశ్నించింది. ప్రొడక్షన్ వారెంట్.. అరెస్ట్ వారెంట్‌తో సమానం పేర్కొంది. మరోవైపు ఏపీ మద్యం రవాణా కేసులో రాజ్ కెసిరెడ్డి, డి.వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణ ప్రక్రియలో నిబంధనలను సరిగ్గా పాటించలేదనే కారణంతో హైకోర్టు ఆదేశాలను ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీంతో తదుపరి విచారణను సీజేఐ ధర్మాసనం వాయిదా వేసింది.

# పారదర్శకత : ఉత్తమ్ కుమార్ రెడ్డి

తరఫున సమర్పించనున్న ప్రజంటేషన్‌లో పొందుపరచాల్సిన అంశాలు, రాష్ట్రంలో అమలవుతున్న జలసంరక్షణ కార్యక్రమాలు, గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ, జలవనరుల జియోట్యాగింగ్, భూగర్భజలాల పర్యవేక్షణతో పాటు దేశవ్యాప్తంగా అనుసరించదగిన సమగ్ర జలభద్రత విధానంపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. దేశ జలభద్రతకు సంబంధించిన కీలక సవాళ్లపై కేంద్రం, రాష్ట్రాలు ఒకే వేదికపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయనున్న నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని మంత్రి పేర్కొన్నారు. జలవనరుల సంరక్షణ నుంచి ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా వరకు వివిధ అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం సాధించేందుకు.. నిర్దిష్ట కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని తెలిపారు. ఇదే వేదికగా తెలంగాణ సమగ్ర జలభద్రత నమూనాను వివరిస్తామని పేర్కొన్నారు. జలవనరుల జియోట్యాగింగ్ ద్వారా పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం కల్పించినట్లు వివరించారు. నిధుల వినియోగం, పనుల పురోగతిని పర్యవేక్షించడంతో పాటు భూగర్భజలాల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. 28వేల చెరువుల మ్యాపింగ్‌తో 25 లక్షల 70 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 9.70 టీఎంసీల నిల్వ సామర్థ్యం పునరుద్ధరణ చేసినట్లు తెలిపారు. గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ పరిరక్షణకు దీర్ఘకాలిక ప్రణాళిక అమలు చేయనున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

# ఎడిటర్ వాయిస్

## మోదీ 'మన్ కీ బాత్'

### కడప రైతు విజయగాథపై ప్రధాన ప్రశంసలు.. లక్షల్లో సంపాదన!

సంప్రదాయ సాగుకు స్వస్తి చెప్పి, విదేశీ పంటలు సాగు చేసిన ఓ రైతు ప్రధాని మోదీ దృష్టిని ఆకర్షించారు. దేశంలోని మిగిలిన రైతులకు ఆదర్శంగా నిలిచిన ఆ రైతు విజయం సోషల్ మీడియాలో మార్మోగిపోతోంది. అందరి రైతులు మాదిరిగానే శ్రమించిన రైతు ఒకే ఒక్క వినూత్న ఆలోచనతో రికార్డు స్థాయి ఆదాయం సంపాదిస్తున్నారు. యూట్యూబ్ లో తెలుసుకుని తన పొలంలో ప్రయోగం చేయడం ద్వారా మిగిలిన రైతులకు స్ఫూర్తిగా నిలిచిన ఆ రైతు పేరు వరదరాజ్. ఏపీలోని కడపకు చెందిన ఆయన ప్రతిభ ఇప్పుడు దేశం దృష్టిని ఆకర్షించింది. అందుకే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ప్రసిద్ధ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 137వ ఎపిసోడ్‌లో వరదరాజ్ ప్రతిభను ప్రత్యేకంగా కొనియాడారు. దేశవ్యాప్తంగా ఉన్న వినూత్న వ్యవసాయ విజయాలను మన్ కీ బాత్ లో ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని మోదీ కడప జిల్లా రైతు వరదరాజ్ అవలంబించిన సాగు విధానం, ఆయన సాధించిన సక్సెస్‌ను జాతికి ఆదర్శం అంటూ కొనియాడారు.

**యూట్యూబ్ స్ఫూర్తితో విదేశీ పండ్ల సాగు**

కడప జిల్లాకు చెందిన రైతు వరదరాజ్ తన పొలంలో ఏళ్లుగా టమోటాలు, అరటిపండ్లను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాధారణంగా వచ్చే ఆదాయంతోనే సర్దుకుపోతున్న ఆయన ఆలోచనలో ఒకరోజు సరికొత్త మార్పు వచ్చింది. తన స్నేహితుడి పొలంలో 'అవకాడో' పంటను చూసిన ఆయనలో ఆసక్తి మొదలైంది. ఒకప్పుడు మన దేశంలో ఈ పండు గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దీని విలువ, మార్కెట్‌లో డిమాండ్ కూడా నామమాత్రమే. కానీ, నగరాల్లోని రెస్టారెంట్లు, హై-ఎండ్ హోటళ్లలో 'అవకాడో టోస్ట్' రూపంలో దీనికి విపరీతమైన డిమాండ్ పెరుగుతున్న విషయాన్ని వరదరాజ్ గమనించారు. ఆలస్యం చేయకుండా ఇంటర్నెట్ బాట పట్టారు. ప్రముఖ వీడియో ప్లాట్‌ఫారమ్ యూట్యూబ్ వేదికగా అవకాడో సాగు మెలకువలు, నేల స్వభావం, నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణ వంటి సమగ్ర సమాచారాన్ని సేకరించారు. పట్టుదలతో తనకున్న కొంత భూమిలోనే అవకాడో మొక్కలను నాకి సాగు చేపట్టారు. వరదరాజ్ పడిన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది. యూట్యూబ్ ద్వారా నేర్చుకున్న ఆధునిక పద్ధతులను సరిగ్గా అమలు చేయడంతో ఆయన తోటలో అవకాడో చెట్లు ఏపుగా పెరిగి కాపు కాశాయి. ఇప్పటివరకు ఆయన తన పొలంలో దాదాపు నాలుగు టన్నుల అవకాడో పండ్లను విజయవంతంగా పండించారు. పండించిన పంటను స్థానిక మార్కెట్లకు సరఫరా చేస్తూ మంచి గిట్టుబాటు ధరను అందుకుంటున్నారు. టమోటా, అరటి సాగుతో పాటు ఈ విదేశీ పండు ద్వారా ఆయన ఆర్జిస్తున్న అదనపు ఆదాయం ఇప్పుడు తోటి రైతులకు సైతం కనువిప్పు కలిగిస్తోంది.

**ప్రధాని ప్రశంసలు**

మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "ఈ రోజుల్లో అవకాడో గురించి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఒకప్పుడు దీని గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. కానీ నేడు ఇది పట్టణాల్లోని డైనింగ్ టేబుల్స్‌పై తరచుగా కనిపిస్తోంది. నగరాల్లోని రెస్టారెంట్లలో అవకాడో టోస్ట్ గురించి మనం తరచుగా వింటున్నాము. మన దేశంలోని వినూత్న ఆలోచనలు కలిగిన రైతులు ఈ విదేశీ పండును సాగు చేస్తూ, అదనపు ఆదాయం సంపాదించుకునేందుకు ఒక చక్కటి కొత్త మార్గాన్ని కనుగొన్నారు" అని కడప రైతు వరదరాజ్ ఆలోచనలను ప్రశంసించారు. ఏపీకి చెందిన వరదరాజ్‌తోపాటు తమిళనాడుకు చెందిన మరో రైతు చంద్రశేఖరన్ వైవిధ్యంగా ఆలోచించి, లాభసాటి వ్యాపారంగా మార్చుకున్న వైనాన్ని మోదీ కొనియాడారు.

**రైతులకు నూతన దిశానిర్దేశం**

నేడు వ్యవసాయ రంగంలో కేవలం వాతావరణం మీద ఆధారపడటమే కాకుండా, మార్కెట్ ట్రెండ్స్‌ను అర్థం చేసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కడప రైతు వరదరాజ్ కేవలం ఒక ఇంటర్నెట్ వీడియోను ఆయుధంగా మలుచుకుని, విదేశీ పండ్లను మన నేలలో పండించి ఆదర్శంగా నిలిచారు. ఈ సక్సెస్ స్టోరీ కేవలం ఆంధ్రప్రదేశ్ రైతులకు మాత్రమే కాక, దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అన్నదాతలకు సరికొత్త మార్గాలను అన్వేషించేలా స్ఫూర్తిని ఇస్తోందని అభినందిస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## కుమార్తెను నడుముకు కట్టుకొని బావిలోకి దూకిన తల్లి



**దండేపల్లి గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎంత కష్టం వచ్చిందో.. కుమార్తెను నడుముకు కట్టుకొని ఓ తల్లి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొట్ల రజిత(26)కు జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వేనుగుమట్లకు చెందిన మెరుగు అంజయ్యతో ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కుమార్తె అక్షిత(6), కుమారుడు మహేందర్(18 నెలలు) ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా కొన్నాళ్లుగా రజిత తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. అంజయ్య అప్పుడప్పుడు వచ్చి పిల్లలను చూసుకొని వెళుతుంటారు. ఆదివారం ఉదయం రజిత అమ్మానాన్నలు పనికి వెళ్లారు. భర్త అంజయ్య ఎప్పటిలాగే వచ్చి, పిల్లలను చూసుకొని వెళ్లారు. అతను వెళ్లిన తర్వాత కొద్దిసేపటికే రజిత కుమారుణ్ని పడుకోబెట్టి, కుమార్తెను తీసుకుని గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అనంతరం కుమార్తెను నడుముకు కట్టుకొని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అటుగా వెళ్తున్న వారికి బావిలో తేలియాడుతున్న మృతదేహాలు కనిపించడంతో కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై ఎస్‌ఐ రాజ్‌వర్ధన్‌ను వివరణ కోరగా.. ఇంకా ఫిర్యాదు అందలేదని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## పంజా విసిరిన 20 ఏళ్ల పగ - గుంటూరులో దారుణ హత్య



**గుంటూరు నేరవార్తలు, విశ్వం వాయిస్ న్యూస్ :** పగతో రగిలిపోతున్న ప్రత్యర్థులు పలుమార్లు హతమార్చేందుకు యత్నించినా, వారినుంచి తప్పించుకున్న ఆ వ్యక్తి.. వేరే ఊరికి వెళ్లిపోయాడు. దాదాపు 20 ఏళ్ల తర్వాత తన చిన్నాన్న చనిపోవడంతో చివరిచూపు కోసం వచ్చిన అతన్ని.. ప్రత్యర్థులు పట్టపగలు వేటకొడవళ్లతో నరికి దారుణంగా హత్య చేసిన ఘటన గుంటూరులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు కొండా వెంకటప్పయ్యకాలనీలో పెండ్ర చిన్నా (55) భార్యతో కలిసి నివాసం ఉండేవాడు. అదే ప్రాంతానికి చెందిన బుల్లయ్య తన భార్యతో చనువుగా ఉంటున్నాడని చిన్నాకు అనుమానం ఉండేది. ఈ క్రమంలో 2006లో బుల్లయ్య హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు సంబంధించి చిన్నాపై అప్పట్లో పోలీసులు అభియోగాలు మోపుతూ.. కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి బుల్లయ్య కుటుంబసభ్యులు చిన్నాపై కక్ష పెంచుకున్నారు. అతన్ని హతమార్చాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన చిన్నా మంగళగిరికి మకాం మార్చాడు. అక్కడా పలుమార్లు హత్యాయత్నాలు జరగడంతో సూర్యాపేటకు వెళ్లిపోయాడు. సుమారు 20 ఏళ్లుగా సూర్యాపేటలో పాత ఇనుము దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

**బాబాయి చివరి చూపునకు వచ్చి..**

గుంటూరు కేవీపీ కాలనీలో ఉంటున్న చిన్నా బాబాయి మత్తయ్య అనారోగ్యంతో ఈ నెల 29న చనిపోయారు. చివరిచూపు కోసం చిన్నా శనివారం గుంటూరు వచ్చాడు. ఈ సమాచారం ప్రత్యర్థులకు తెలిసింది. ఆదివారం ఉదయం చిన్నా కుటుంబంతో కలిసి బాబాయి మృతదేహాన్ని సందర్శించాడు. తరువాత అల్పాహారం తినడానికి బయటకు రాగా, దారిలో ద్విచక్ర వాహనాలపై దుండగులు వెంటపడ్డారు. కొంతమంది కర్రలతో చిన్నాను కొట్టగా కిందపడిపోయిన తర్వాత వేటకొడవళ్లతో నరికి, కత్తులతో పొడిచారు. రోడ్డుపై మెడ తెగి, రక్తపు మడుగులో మృతదేహం పడి ఉంది. బుల్లయ్య కుమారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, అతని స్నేహితులు కలిసి ఈ హత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని సీఐ రాజేష్ తెలిపారు.

## బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు.. 11మంది మృతి



**కౌశాంబి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బాణ సంచా పరిశ్రమలో చెలరేగిన పేలుడు ఘటనలో 11 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కౌశాంబి జిల్లా మెజిస్ట్రేట్ అమిత్ పాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పిప్రీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మనోరి గ్రామంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వారిని ప్రయాగ్‌రాజ్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో మృతులంతా ఆ పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో నివసించేవారేనని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ పేలుడు ఘటనలో 18 మందికి గాయాలైనట్లు సమాచారం. శిథిలాల కింద ఇంకా ఎవరైనా చిక్కుకున్నారేమోననే అనుమానంతో వారి కోసం గాలిస్తున్నారు.

**సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విచారం**


ఈ ఘటనపై సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి తగిన వైద్యం అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

## చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం

### ముగ్గురు యువకుల దుర్మరణం



**నల్లమాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తూ ముగ్గురు బలైన ఘటన శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం అరవవాండ్లపల్లిలో జరిగింది. ఎస్సై సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టపర్తి నుంచి ముగ్గురు యువకులు ఆదివారం రాత్రి 7.30 గంటలకు కదిరికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అరవవాండ్లపల్లి వద్ద వేగాన్ని నియంత్రించలేక చెట్టును ఢీకొట్టారు. ప్రమాదంలో పుట్టపర్తికి చెందిన అనిల్ (25), కొత్తచెరువుకు చెందిన అర్జున్ (25), గోరంట్లకు చెందిన దీక్షిత్ (25) అక్కడికక్కడే మృతిచెందారు. ద్విచక్ర వాహనం మంటల్లో దగ్ధమైంది. అనిల్, అర్జున్ పాల ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. దీక్షిత్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఈ ఘటనతో ఆటో నడుపుకొంటూ జీవనం సాగించే పేదల కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.






**గోకవరం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాన కేంద్రాల్లో ఆవుల సంచారం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్, తానా సెంటర్, పాత బస్టాండు, ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఆవులు రోడ్లపైనే తిరుగుతూ, పడుకుంటుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారిపై ఒక్కసారిగా ఆవులు అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా రద్దీ సమయాల్లో రోడ్డుకు అడ్డంగా ఆవులు గుంపులుగా పడుకోవడంతో వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు దుకాణాల వద్ద ద్విచక్ర వాహనాలపై ఉంచిన సామాన్లను ఆవులు ఒక్కసారిగా లాగేయడం, కిందపడేయడం వంటి ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. దీంతో వాహనదారులు, వ్యాపారులు నష్టపోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం చూపడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని మండిపడుతున్నారు. ఆవులు ఎవరికి చెందినవో గుర్తించి ఆయా రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఇకపై పశువులను రోడ్లపై వదిలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో పాటు, రోడ్లపై తిరుగుతున్న పశువులను గోశాలలకు తరలించేలా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలకు కారణమవుతున్న పశువుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలు పోయిన తర్వాత మేల్కొనే పరిస్థితి రాకముందే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

### చెత్తాచెదారంతో

## అపరిశుభ్రంగా సోమేశ్వరం

### గ్రీవెన్స్‌లో అధికారులకు జనసేన నాయకుడి ఫిర్యాదు



**రాయవరం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** సోమేశ్వరం గ్రామంలోని ప్రధాన రహదారి, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మార్కెట్, స్మశానవాటిక పరిసరాలు చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారి అందవికారంగా కనిపిస్తున్నాయని గ్రామ జనసేన పార్టీ కార్యదర్శి కాళ్ళ మణి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న గ్రీవెన్స్ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వై.ఎన్.ఎన్. గోపాల్‌కు పీజీఆర్ఎస్ అర్జీ సమర్పించారు. అపరిశుభ్రత కారణంగా విషపురుగులు, క్రిమికీటకాలకు ఆ ప్రాంతాలు ఆవాసాలుగా మారుతున్నాయని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టి, చెత్తాచెదారాన్ని తొలగించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను కోరారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజల కష్టాలు, అవసరాలు తెలుసుకోవడానికి వేదికగా 'ప్రజా దర్బార్'

### ప్రజల సమస్యలకు ప్రాధాన్యం... ప్రతి అర్జీకి పరిష్కారమే లక్ష్యం - ప్రజా దర్బార్లో 39 వినతులు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల కష్టాలు, సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపటానికి వేదికగా ప్రజా దర్బార్ ఉపయోగపడుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. సోమవారం రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 39 అర్జీలు అందాయి. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను ప్రజలు సమర్పించారు. ప్రతి అర్జీని మంత్రి సుభాష్ స్వయంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా అర్హులైన ప్రతి



ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి వద్దకే ప్రభుత్వం చేరువ కావాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ప్రజల కష్టాలు, అవసరాలను తెలుసుకోవడానికి ప్రజా దర్బార్ వేదికగా నిలుస్తోందని, ప్రతి వినతిని బాధ్యతగా స్వీకరించి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు పాల్గొన్నారు.


### రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

## విద్యార్థుల క్రీడా ప్రతిభ

### ఎన్.ఆర్.సి. స్థాయి పోటీలలో పతకాల పంట



**రామచంద్రపురం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 29, 2026 న కాకినాడ పి.ఆర్. కళాశాలలో నిర్వహించిన ఎన్.ఆర్.సి. స్థాయి క్రీడా పోటీలలో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో వివిధ విభాగాల్లో పాల్గొని మన విద్యార్థులు అద్భుతమైన ప్రతిభతో పతకాలను సాధించారు. పోటీలలో పీ. చంద్రకళ లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం సాధించగా, జీ. లక్ష్మి షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం దక్కించుకున్నారు. అలాగే జీ. రాజేష్ లాంగ్ జంప్ (బాయ్స్) విభాగంలో ద్వితీయ స్థానం పొందగా, సుమంత్ షాట్‌పుట్‌లో మరియు జీ. రాజు 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. కళాశాల విద్యార్థులు వివిధ ఈవెంట్లలో పతకాలు సాధించి సంస్థకు మంచి పేరు మరియు గుర్తింపు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను, కళాశాల పి.డి. పి. నూకరాజును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. చిట్టిబాబు, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా అభినందించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



### జాతీయ స్థాయి హైజంప్ పోటీలకు ఎంపికైన చంద్రకళకు

## సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ అభినందనలు

### జాతీయ స్థాయిలోనూ రాణించి రామచంద్రపురానికి పేరు తీసుకురావాలని ఆకాంక్ష

**రామచంద్రపురం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 15, 16, 17, 18 తేదీల్లో పాండిచ్చేరిలో జరగనున్న జాతీయస్థాయి హైజంప్ పోటీలకు ఎంపికైన రామచంద్రపురం డిగ్రీ కళాశాల విద్యార్థిని పి. చంద్రకళను, ఆమె కోచ్ అరుణ్ కుమార్, డిగ్రీ కళాశాల పీడీ నూకరాజును సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం అభినందించారు. ఇటీవల ఆగస్టు 11, 12, 13 తేదీల్లో తిరుపతిలో జరిగిన హైజంప్ పోటీల్లో చంద్రకళ ప్రథమ స్థానంలో నిలిచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల వాసంశెట్టి సత్యం ప్రత్యేకంగా అభినందించారు. పాండిచ్చేరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థిని చంద్రకళ, ఆమె కోచ్‌కు అవసరమైన ప్రయాణ టికెట్లను సమకూరుస్తామని వాసంశెట్టి సత్యం హామీ ఇచ్చారు. జాతీయస్థాయిలోనూ అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించి రామచంద్రపురం ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఎప్పుడూ ముందు



ఉంటుందన్నారు. ఇప్పటికే చంద్రకళకు అవసరమైన షూస్, స్పోర్ట్స్ కిట్లను కూడా అందించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపుతున్న యువతకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రకళ జాతీయస్థాయిలోనూ విజయం సాధించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వాసంశెట్టి సత్యం ఆకాంక్షించారు.




విశ్వంవాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
మంగళవారం, 01 సెప్టెంబర్ 2026
www.viswamvoice.com


# విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోండి

## జిల్లా విద్యుత్ శాఖ సమీక్షలో ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన విద్యుత్ శాఖ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి ఎంపీ పాల్గొన్నారు. జిల్లాలో విద్యుత్ సరఫరా పరిస్థితి, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీ సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా విద్యుత్ శాఖకు అందిన 1,912 ఫిర్యాదులను గ్రామాల వారీగా విశ్లేషించాలని హరీష్ బాలయోగి సూచించారు. ఏ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి, వాటికి ప్రధాన కారణాలు ఏమిటనే అంశాలను గుర్తించి, కేవలం తాత్కాలిక పరిష్కారాలతో సరిపెట్టకుండా సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించి, సమస్య పరిష్కారమైన విషయాన్ని సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సూచించారు. జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సుమారు రూ.327 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు, ఇతర విద్యుత్ మౌలిక వసతుల బలోపేతానికి చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని ఎంపీ తెలిపారు. నిర్ణయించిన గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. వర్షాకాలం, తుపానులు, భారీ గాలులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చోట మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని, అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యుత్ వినియోగం పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు రైతులు, గృహ వినియోగదారులు, వాణిజ్య సంస్థలు ఎదుర్కొనే సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యకు మూల కారణాన్ని గుర్తించి పరిష్కరించాలని ఎంపీ హరీష్ బాలయోగి అన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే జిల్లాలో విద్యుత్ అంతరాయాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా శాఖాపరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖకు చెందిన అధికారులు జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితి, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై వివరాలను ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేలకు వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

## పీజీఆర్ఎస్ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి

# నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలి

**అమలాపురం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతతో కూడిన పరిష్కారాలను సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అర్జీని ప్రత్యేకంగా పరిశీలించి, అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని సూచించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్, డీఆర్వో వి. సుబ్బారావు, డీఆర్డీఏ పీడీ డి. రాంబాబు, సమగ్ర శిక్ష ఏపీఓ మమ్మి, డీఎల్డీవో విజయలక్ష్మి తదితర అధికారులతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 185 అర్జీలు అందాయి. భూ రికార్డుల ఆన్‌లైన్ నమోదు, రీ-సర్వే, భూ ఆక్రమణలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పారిశుధ్యం, మురుగుకాలువల్లో పూడికతీత, ఇంటి స్థలం, గృహ నిర్మాణం, పింఛన్లు, సదరం సర్టిఫికెట్లు, రోడ్ల మంజూరు తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



సంబంధిత శాఖల అధికారులకు సూచిస్తూ, సమస్య స్వభావాన్ని బట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి, సమస్యలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలన్నారు. అర్జీదారుల సమస్యలను కేవలం కార్యాలయ స్థాయిలోనే కాకుండా అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన అనంతరం నాణ్యతతో కూడిన, సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన అర్జీల పరిష్కారంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, పరిష్కరించిన అర్జీల వివరాలు, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను కూడా నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు తమ సమస్యలను పీజీఆర్ఎస్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల కోసం 1100 టోల్‌ఫ్రీ నంబర్, 'మీకోసం' ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. తమ అర్జీ పరిష్కార పురోగతిని నేరుగా తెలుసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు తమ పరిధిలోని డివిజన్, మండల, స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో కూడా అధికారులకు తమ సమస్యలను సమర్పించుకోవచ్చ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఒత్తిడిని తట్టుకోవడమే అసలైన విజయం



**అమలాపురం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఏఎస్ఎన్ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మానసిక ఒత్తిడిని అధిగమించడం, యోగాభ్యాసం ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్య బాలాజీ సుషమ్న క్రియా యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శిరీష రుద్రరాజు 'ఒత్తిడిని తట్టుకుంటూ విజయం సాధించడం ఎలా' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుషమ్న క్రియా యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు అనేక సమస్యలను అధిగమించవచ్చన్నారు. మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే జీవితంలో విజయాలను సాధించగలమని పేర్కొన్నారు. శారీరకంగా ఎంత బలంగా ఉన్నప్పటికీ మానసిక బలం లేకపోతే వ్యక్తి బలహీనంగా మారుతారని అన్నారు. ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడిని తట్టుకునేలా యోగాభ్యాసం, సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఎన్ మహిళా కళాశాల యాజమాన్యం పాల్గొంది. ఫౌండేషన్ ప్రతినిధులు వనజ, మాధవ్, శ్రీదేవి, శుభ తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

## అభిమాని నూతన గృహాన్ని

# ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు



**రావులపాలెం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పమ్మి వెంకట నరసింహం, శ్రీమతి భారతి దంపతులచే నూతనంగా నిర్మించిన గృహాన్ని తనపై ఉన్న అభిమానంతో నరసింహం కోరిక మేరకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. తాము ఎంతగానో అభిమానించే తమ నేత సత్యానందరావు తమ గృహాన్ని ప్రారంభించడంపై నరసింహం దంపతులు సంతోషం వ్యక్తంచేశారు.

# వేమన చెప్పిన నీతిని మనం అనుసరించాలి

## మాతృభాష ప్రాధాన్యాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించాలి



**రావులపాలెం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం సిఆర్‌సిలో జరిగిన వేమన శతకం శతక పద్య సహస్ర గళార్చన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుమాట్లాడుతూ వేమన చెప్పిన నీతిని మనం అనుసరించాలని, అప్పుడే తెలుగువాడిగా సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా రూపొందుతామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం ప్రగతి భారతమ్ ట్రస్టు, పెరవలి మాతృభాషా పరిరక్షణ సేవా సమితి వారి సంయుక్త ఆధ్వర్యంలో 1008 మంది చిన్నారులకు 108 వేమన పద్యములు రావులపాలెం చిన్నం సుబ్బిరెడ్డి ఫంక్షన్ హాల్ లో సోమవారం వేమన శతకం శతక పద్య సహస్ర గళార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ భాజపా నాయకులు తమలంపూడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మాతృభాష పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థుల చేత వేమన శతకాన్ని అవపోషణ పట్టించడం అభినందనీయమన్నారు. నేటి విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే విధంగా, మంచి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో, తెలుగు భాష గౌరవాన్ని, ఔన్నత్యాన్ని చాటి చెప్పడం కోసం గొప్ప కార్యక్రమాన్ని సి ఆర్ సి లో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు సాంప్రదాయమైన దుస్తులతో, తెలుగుదనం ఉట్టిపడే విధంగా హాజరు కావడం చూస్తే ముచ్చటేస్తుందన్నారు. వారితో వేమన పద్యాలను చదివించారు. వినయం, సత్ప్రవర్తన,నైతిక విలువలు వేమన శతకం వంటి శతకాలను చదవడం ద్వారా అలవాడతాయన్నారు.మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని నిర్వాహకులను అభినందిస్తూ తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల చేత "అన్ని భాషల కన్నా అమ్మ భాష మిన్న"అంటూ నినాదాలు చేయించారు. వేమన శతకంలోని ప్రతిపద్యాన్ని కంఠస్థం చేసి భావాన్ని అర్థం చేసుకొని పాటించినప్పుడే విద్యార్థులకు సత్ఫలితాలు అందుతాయన్నారు. మాతృభాష ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.

# దానాలన్నిటిలోకి అన్నదానం మహోత్కృష్టమైనది

## రాష్ట్రంలోనే ప్రముఖ దేవాలయాల్లో పలివెల ఉమా కొప్పులింగేశ్వర స్వామి ఆలయం ఒకటి
## ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నాం : కొత్తపేట ఎమ్మెల్యే బండారు




**కొత్తపేట, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** దానాలన్నిటిలోనూ అన్నదానం మహోత్కృష్టమైనదిగా మన పురాణాలు తెలియజేస్తున్నాయని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మన సాంప్రదాయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం పలివెల ఉమా కొప్పు లింగేశ్వర స్వామి వారి దేవాలయంలో అన్నదానం కార్యక్రమం ప్రారంభించి రెండు సంవత్సరాలు అయిన సందర్భంగా సోమవారం ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధి చెందితే ఆ చుట్టుపక్కల ఉన్న అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పలివెల క్షేత్రం అత్యంత పురాతనమైన క్షేత్రమని, ఈ క్షేత్రంలో ప్రతిరోజు 500 నుంచి 600 మందికి, పర్వదినాల్లో అయితే 2వేల మంది వరకు దేవాలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహిస్తూ భక్తులకు సేవలందించడం ప్రశంసనీయమన్నారు.అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు,మురళి, రాంబాబు,రామకృష్ణ, రావూరి వెంకటేశ్వరరావు, తాతాజీ బృందాన్ని, దాతలను ఆయన అభినందించారు. సమాజం బాగుండాలంటే దేవుని ఆశీస్సులు ఉండాలని ఆయన అన్నారు. ఆలయం అభివృద్ధి చెందితే గ్రామం సైతం అభివృద్ధి చెంది స్థానికులకు అనేక ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. ఆలయంలో రాజగోపురం నిర్మాణం మొదలయిందన్నారు,కోనేరు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యేను స్థానికులు అభినందించారు.

# కోకో బీచ్‌లో శ్రీ సత్తమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



**అమలాపురం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రా గోవాగా పేరొందిన ఎస్. యానాం కోకో బీచ్ ఆవరణలో నూతనంగా నిర్మించనున్న శ్రీ సత్తమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఆయన సతీమణి అరుణ సోమవారం శాస్త్రోక్తంగా భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మికతతో పాటు పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న ఎస్. యానాం కోకో బీచ్ ప్రాంతంలో గ్రామదేవత శ్రీ సత్తమ్మ తల్లి ఆలయం నిర్మాణం చేపట్టడం సంతోషదాయకమన్నారు. అమ్మవారి దివ్యాశీస్సులతో ఈ ప్రాంత ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణంతో ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభ మరింత పెరుగుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రాంగణంలో అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధికి తోడు ఆధ్యాత్మికతను కూడా జోడించి ఎస్. యానాంను మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వంలో రైతే రాజు

**రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం - మార్కెట్ కమిటీ అభివృద్ధి సహకరిస్తా : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**

**ఘనంగా కాకినాడ రూరల్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం**





**కాకినాడ, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కాకినాడ రూరల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి సుభాష్ తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ వ్యవసాయం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం సోమవారం కాకినాడ ఇంద్రపాలెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)అధ్యక్షత వహించారు. నూతనంగా ఎన్నికైన కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం మహోత్సవంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కూటమిలో పనిచేసిన అందరికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. గడచిన రెండున్నర ఏళ్ల హయాంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని అభివృద్ధితో ఐక్యంగా తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు. గత వైసిపి హయాంలో అన్నదాతలను అన్ని విధాలుగా మోసం చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ పథకం, రైతులకు గిట్టుబాటు ధర, ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడం వంటి కార్యక్రమాలు దిగ్విజయంగా అమలు చేసామన్నారు. రైతులు పండించిన పంటను ఆర్ బి కే కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి 24 గంటల్లో రైతులు అకౌంట్లో సొమ్ము జమ చేసామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాసుమేను మంగ మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని చెప్పారు. అనంతరం మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, రంబాల వెంకటేశ్వరరావు, చైల్డ్ రైస్ కమిషన్ చైర్మన్ సూర్యనారాయణ రాజు, కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ్డ రమేష్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, గోదావరి డెల్టా నీటి సంఘం అధ్యక్షులు సునీల్, కుడా చైర్మన్ తలాటం సత్య, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 2న గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జలహారతి

**రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయండి : తుని ఎమ్మెల్యే యనమల దివ్య**



**కోటనందూరు, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అపరభగీరధ ప్రయత్నం ఫలించి ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల చిరకాల కల సాకారం అయిందని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు.ఈమహోన్నత కార్యక్రమం సెప్టెంబర్ 2న పాయకరావుపేట్లో ఆవిష్కృతం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ఘన స్వాగతం చెప్పాల్సిన బాధ్యత ప్రతి అన్నదాతపై ఉందని యనమల దివ్య అన్నారు.తాండవ షుగర్ ఫ్యాక్టరీ వద్ద జలహారతి,పీఎల్ పురంలో జరిగే బహిరంగ సభకు తుని నియోజకవర్గ ప్రజలు అపూర్వ రీతిలో స్వాగతసుమాంజలి పలుకుతారని ఆమె తెలిపారు.ఇందుకు సంబందించిన ఏర్పాట్లపై పార్టీ పరిశీలకులు, టీడీపీ నాయకులతో కలిసి తుని కూటమి కార్యాలయంలో సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో యనమల దివ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి ముందుగా చెప్పినట్టు అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు రప్పించి రైతు బాంధవుడనిపించుకున్నారని అన్నారు. పోలవరం ఎడమ కాల్వ నిర్మాణానికి ఇళ్ళు కోల్పోయినా పర్వాలేదు ఉత్తరాంధ్ర సస్యశ్యామలం కావాలన్న ఆకాంక్షతో కాలనీని ఖాళీ చేసిన కుమ్మరిలోవ ప్రజలకు ఎమ్మెల్యే యనమల దివ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహోన్నత కార్యక్రమంలో వారి త్యాగం మరవ లేమన్న ఆమె ఆధ్యాధునిక వసతులతో నిర్వాసితులకు టౌన్ షిఫ్ నిర్వహిస్తున్నామన్నారు. సీఎం ప్రొగ్రాంకు తుని నియోజకవర్గం నుంచి ఆరువేల మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని వీరికి వంద బస్సులు సమకూర్చడం జరిగిందన్నారు. ఈసమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొంతం కొండబాబు,రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్ రావు, అన్నవరం ట్రస్ట్ బోర్డు నెంబర్ పాలచర్ల నాగేంద్ర చౌదరి, తుని నియోజకవర్గ పరిశీలకుడు ఎర్రా వేణుగోపాలరాయుడు, లోడగల కృష్ణ, రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రితో పాటు సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి,యినుగంటి సత్యనారాయణ కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, అంకంరెడ్డి రమేష్,పోతల సూరిబాబు మల్ల గణేష్, కుండల రామకృష్ణ, కుక్కడపు బాలాజీ పరవాడ తాతబాబు, తమరాన వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ ఆహార పరిశ్రమలకు

# ప్రభుత్వం నుండి భారీ ప్రోత్సాహం

**శ్రీనిధి ద్వారా రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం**

**అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఏ పి ఎం సూర్యకుమారి విజ్ఞప్తి**

**కాకినాడ జిల్లా, కోటనందూరు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కీలక ప్రకటన**



**కోటనందూరు, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సూర్య కుమారి తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ లోని మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు, సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించాలనుకునే ఔత్సాహిక మహిళలకు ప్రభుత్వం నుండి ఒక గొప్ప అవకాశం అందుబాటులోకి వచ్చింది. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంలో భాగంగా, చిన్న తరహా ఆహార ప్రాసెసింగ్ వ్యాపారాలను అభివృద్ధి చేసి, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక సహాయ పథకాన్ని అందిస్తోంది. ఈ పథకం కింద, మహిళా పారిశ్రామికవేత్తలు తమ ప్రాజెక్ట్ ఖర్చులో 90 శాతం వరకు రుణాన్ని పొందవచ్చు. గరిష్టంగా రూ.3 లక్షల వరకు శ్రీనిధి రుణం లభిస్తుంది. దీనికి కావలసిన 10 శాతం వాటాను మాత్రమే లబ్ధిదారులు సమకూర్చుకోవాలి. ముఖ్యంగా, ఈ రుణంతో పాటు ప్రాజెక్ట్ వ్యయంలో 35 శాతం వరకు (గరిష్టంగా రూ.1.05 లక్షల వరకు) బ్యాంకు ముగింపు రాయితీ కూడా లభిస్తుంది. ఇది కేవలం రుణం మాత్రమే కాదు, తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని ప్రోత్సాహకం కూడా. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కొన్ని అర్హతలు ఉన్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళలై ఉండాలి మరియు మంచి రుణ చెల్లింపు చరిత్ర కలిగి ఉండాలి. వారి సంఘం పేరుతో కనీసం రూ.5,000 శ్రీనిధి-సమృద్ధి పొదుపు ఉండాలి. లబ్ధిదారు వయస్సు 18 నుండి 65 సంవత్సరాల మధ్య ఉండాలి. అంతేకాకుండా, సూక్ష్మ ఆహార పరిశ్రమల పథకం ప్రారంభ నిధిలో అర్హత కలిగి ఉండి, గతంలో తీసుకున్న రుణాలు నిరర్థక ఆస్తులుగా మారకూడదు. ఈ రుణం పొందే ప్రక్రియ చాలా సులభతరం చేయబడింది. ఆసక్తి గల మహిళలు మొదట తమ వివరాలను సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసుకోవాలి. అనంతరం, ప్రాజెక్ట్ కోసం సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను సిద్ధం చేసి, అధికారిక అంతర్జాల పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు దరఖాస్తును పరిశీలించి ఆమోదం తెలిపిన తరువాత, శ్రీనిధి రుణం మంజూరవుతుంది. చివరగా, రుణం విడుదల చేయబడి, రాయితీ సొమ్ము జమ చేయబడుతుంది. మహిళలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీఎం సూర్య కుమారి పిలుపునిచ్చారు.

గంజాయి, డ్రగ్స్, దుష్పరిణామాలు, సైబర్ నేరాలపై

# పోలీసులు అవగాహన సదస్సు



**కాకినాడ, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పెద్దాపురం డి.ఎస్.పి ఏబిజి తిలక్ పర్యవేక్షణలో జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామంలో ప్రజలకు చట్టాలు, గంజాయి, డ్రగ్స్ - దుష్పరిణామాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట సిఐ బి.తిరుపతిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ తిరుపతిరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వాటి వలన ఆరోగ్యం, కుటుంబం మరియు సమాజంపై పడే దుష్ప్రభావాల గురించి ప్రజలకు మరియు యువతకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన మరియు బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా, జగ్గంపేట సీఐ 9440786529, జగ్గంపేట ఎస్సై 9440796569 డయల్ 112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట స్టేషన్ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండండి



**కోటనందూరు, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** అసాంఘిక కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎస్సై టి.రామకృష్ణ అన్నారు. కాకినాడ జిల్లా కోటనందూరులో మీడియాతో ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ యువత గంజాయికి బానిసలై ఉన్నారని వీరికి డిటెక్షన్ విధానంలో పరీక్షించి పాజిటివ్ అని తేలితే జైలు శిక్ష పడుతుందని, గంజాయి రవాణా చేసిన అమ్మిన కఠిన చర్యలు ఉంటాయని తెలియజేస్తూ గ్రామాలలో సాంఘిక చైతన్యం కల్పిస్తున్నామని అన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలపై లైంగిక వేధింపులు జరిగిన లైంగిక దాడులు జరిగిన పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

**మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి**

సమాజంలో చీటీల పేరుతో ఎక్కువ మోసాలు జరుగుతున్నాయని ఎక్కువ వడ్డీలకు ఆశపడ వద్దని అన్నారు. డిజిటల్ యాప్ ద్వారా రుణాలు తీసుకోవద్దని అన్నారు. సైబర్ మోసాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. స్థానిక సంస్థ ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని, గొడవలు,అరాచకాలు, గందరగోళం సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సీసీ కెమెరాలు ప్రాముఖ్యత తెలియజేస్తూ ఆర్టిజిఎస్ సిస్టం ద్వారా పోలీస్ రికార్డులలో కేసులు నమోదై తప్పించుకుంటే ఈ పద్ధతి ద్వారా వారు ఎక్కడ ఉన్న తెలుసుకునే విధానం ఉంటుందని తెలియజేస్తూ కేఈ చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన మహిళ మిస్సింగ్ కేసులో ఈ పద్ధతి ద్వారానే తెలుసుకోవడం జరిగిందని తెలియజేశారు.

గ్రామ పంచాయతీ వార్డు

# పోలింగ్ స్టేషన్‌ల జాబితా విడుదల



**కోటనందూరు, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ పంచాయతీ వార్డు పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల చేసినట్లు ఎంపీడీవో పి.వెంకటనారాయణ తెలియజేశారు. కాకినాడ జిల్లా కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో జాబితా విడుదల చేసి మాట్లాడుతూ త్వరలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా మండలంలో మొత్తం 17 గ్రామపంచాయతీలకు 174 వార్డులకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల జాబితా కు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి హరేంద్ర ప్రసాద్ ఈనెల 29వ తేదీన ఆమోదం తెలిపారని,ఈ జాబితాని ఈరోజు ప్రచురించడం జరిగిందని తెలియజేశారు.

రేషన్ బస్తాలపై

# క్యూఆర్ కోడ్ స్కానింగ్ వలన డీలర్లకు ఇబ్బంది



**కోటనందూరు, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** రేషన్ బస్తాలపై క్యూఆర్ కోడ్ స్కానింగ్ వలన రేషన్ డీలర్లకు ఇబ్బందులు ఎదురవుతాయని మండల డీలర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ దారకొండ జోగిరాజు అన్నారు. కాకినాడ జిల్లా కోటనందూరు తాహసిల్దార్ బి రాజుకి మండల డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జోగిరాజు మాట్లాడుతూ సెప్టెంబర్ నెల నుండి రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయు 10 శాతం బ్రోకెన్ రైస్ బియ్యం బస్తాలపై క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ చేయాలని డీలర్లను ఆదేశించారని ఈ పద్ధతి వలన డీలర్లకు పని భారం పెరుగుతుందని అన్నారు. రేషన్ డీలర్లు చాలామందికి ఆండ్రాయిడ్ ఫోన్లు అందుబాటులో లేవని యాప్ ను డౌన్లోడ్ చేసుకునే పరిస్థితి లేదని అన్నారు. మండల స్టాక్ పాయింట్ లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ పద్ధతి ప్రవేశ పెట్టలేదన్నారు. మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో జరుగుతున్న అవకతవకులను అధికారికంగా రేషన్ డీలర్లతో మాపి చేయడం జరుగుతుందని, డీలర్లు ఆవేదన చెందుతున్నారన్నారు ఎన్నో ఇబ్బందులు సమస్యలు పరిష్కారం చేయవలసిన సమయంలో వాటిని పరిగణలోనికి తీసుకోకుండా రేషన్ డీలర్లను బాధ్యులను చేస్తూ రేషన్ డీలర్లు మనోవేదనకు గురిచేస్తూ నూతన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని ఒకసారి సమీక్షించి నిలిపివేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

విద్య, వైద్య రంగాలకు

# అధిక ప్రాధాన్యతనిస్తున్న కూటమి ప్రభుత్వం



**కోటనందూరు, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం ఆదిశగా ప్రణాళికలు అమలు చేస్తుందని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు. కాకినాడ జిల్లా,తొండంగి మండలం వేమవరంలో నూతనంగా తలపెట్టిన విలేజ్ హెల్త్ సెంటర్ కు సీనియర్ నేత యనమల రాజేష్ తో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజావసరాలకు ప్రాధాన్యత ఇస్తూ అందుకు అవసరమైయ్యే వసతుల కల్పిస్తున్నామన్నారు. ఓవైపు మౌళిక వసతులు కల్పిస్తూ మరో వైపు ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఇవాళ వేమవరంలో విలేజ్ హెల్త్ సెంటర్ కు శంఖుస్థాపన చేస్తున్నామన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అంతకు ముందు వేమవరం వచ్చిన ఎమ్మెల్యే యనమల దివ్యకు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు .ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



# దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**విద్యాభివృద్ధి కోసం యావదాస్తిని దానం చేసిన మహోన్నత సంఘసంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి**
**ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం పూర్వజన్మ సుకృతం : మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ శెట్టిబలిజ జాతి పితామహుడు, కీర్తిశేషులు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని గుబ్బలవారి పాలెంలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను, త్యాగాలను కొనియాడారు. విద్యాభివృద్ధి కోసం తన యావదాస్తిని దానం చేసిన గొప్ప సంఘసంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి అని మంత్రి పేర్కొన్నారు. సమాజంలో విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి తన ఆస్తులను సైతం విద్యాభివృద్ధికి వినియోగించిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. కులాల మధ్య ఐక్యతను పెంపొందించేందుకు దొమ్మేటి వెంకటరెడ్డి విశేష కృషి చేశారని, శెట్టిబలిజ సమాజానికి ఆ పేరును నామకరణం చేసిన మహనీయుడు ఆయనేనని మంత్రి తెలిపారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. అన్ని కులాలను గౌరవిస్తూ, అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సమాజంలో పరస్పర గౌరవం, సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించేలా అధికారిక ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్లకు మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తుల సాయి, గంధం పళ్ళం రాజు, చిక్కాల గణేష్, మోకా సుబ్బారావు, స్థానిక శెట్టిబలిజ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ నిర్మాణం

**విజయ ప్రసాద్ రెడ్డి సేవాభావానికి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రశంసలు**





**బిక్కవోలు, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా అవసరాలను గుర్తించి సొంత నిధులతో సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం, బలభద్రపురం గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం విజయ్ ప్రసాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. పాస్టర్ విజయ్ ప్రసాద్ రెడ్డి సుమారు రూ.70 వేల వ్యయంతో ఈ బస్సు షెల్టర్‌ను నిర్మించగా, బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఎండ, వర్షం నుంచి రక్షణ పొందేలా షెల్టర్‌ను ఏర్పాటు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సమాజం పట్ల బాధ్యత, అవగాహన కలిగి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్న విజయ ప్రసాద్ రెడ్డి సేవలను కొనియాడారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టే ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నల్లమిల్లి సుబ్బారెడ్డి, జనసేన నాయకులు రేవాడ నాగు, స్థానిక కూటమి నాయకులు, విజయ్ ప్రసాద్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల మత్తు యువత భవితకే ముప్పు

**సోమేశ్వరం జడ్పీహెచ్ఎస్‌లో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు**



**రాయవరం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతలో అవగాహన పెంపొందించాలని రాయవరం పోలీస్ స్టేషన్ ఎస్సై. సురేష్ బాబు సూచించారు. రాయవరం మండలం సోమేశ్వరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఎం ఆధ్వర్యంలో సోమవారం డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి. సురేష్ బాబు, ఈగల్ టీం ఏఎస్ఐ అప్పారావు పాల్గొని విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ప్రస్తుతం యువతలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వాటికి దూరంగా ఉండాలని లేదంటే ముప్పు లో పడతారని సూచించారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో పయనించాలని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని ఎస్సై సురేష్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలి : నూతన ఎస్సై శివాజీ



**కోరుకొండ, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలందరూ సహకరించాలని కోరుకొండ నూతన ఎస్సై ఆర్ శివాజీ అన్నారు. సోమవారం కోరుకొండ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఆర్ శివాజీ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శివాజీకి, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. శివాజీ గతంలో గోకవరం, దేవరపల్లి, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో పనిచేసి అన్ని వర్గాల ప్రజల మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కోరుకొండ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలందరూ సహకరించాలని, మరి ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తన పరిధిలో ఎటువంటి అసంఘిక కార్యక్రమాలు జరిగిన తమ దృష్టికి తీసుకువచ్చి సహకరించాల న్నారు.కోరుకొండ ఎస్సైగా ఇప్పటివరకు పని చేసిన వెంకట రమేష్ విఆర్ కు వెళ్లారు.

**ఎమ్మెల్యేను కలిసిన**

# ప్రజానాయకుడు వరసాల ప్రసాద్

**గోకవరం సమస్యల పరిష్కారంపై సానుకూల చర్చ.. పంచాయతీ రిజర్వేషన్లపై ఆరా**



**గోకవరం, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజానాయకుడు వరసాల ప్రసాద్ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిశారు. ఈ సందర్భంగా మండలంలో చాలాకాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, వాటిపై సానుకూలంగా చర్చించారు. ముఖ్యంగా రానున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గోకవరం మండలంలో రిజర్వేషన్ల ప్రక్రియపై ఎమ్మెల్యేను వరసాల ప్రసాద్ ఆరా తీశారు. ఎన్నికల ప్రక్రియ, రిజర్వేషన్ల అంశంపై వివరాలను తెలుసుకున్నారు. గోకవరం మండల అభివృద్ధికి సంబంధించి మరిన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు.

**పదేళ్ల స్నేహబంధం**

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో తనకు సుమారు పదేళ్లుగా స్నేహబంధం కొనసాగుతోందని వరసాల ప్రసాద్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గతంలో పలు రాజకీయ పార్టీల్లో వివిధ ఉన్నత పదవులు చేపట్టిన వరసాల ప్రసాద్ గోకవరం మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేశారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ అందుబాటులో ఉండటంతో వరసాల ప్రసాద్‌కు మండల ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, అందుకే ఆయనను ప్రజానాయకుడిగా పిలుస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యేతో జరిగిన తాజా భేటీతో గోకవరం సమస్యల పరిష్కారంపై ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి.

**గాదరాడ గ్రామానికి విద్యుత్, త్రాగునీరు**

# సమస్యలను పరిష్కరించండి : తోరాటి

**ఎంపీడీవో బత్తినకు వినతి పత్రం**



**కోరుకొండ, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలోని గాదరాడ గ్రామంలో లోతట్టు ప్రాంత ప్రజలకు సత్యసాయి బాబా త్రాగునీరు, విద్యుత్ వంటి సమస్యలను పరిష్కరించాలని వైఎస్ఆర్సిపి నాయకులు తోరాటి శ్రీనివాస్ కోరుకొండ ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో బత్తినను కలిసి, విద్యుత్తు, సత్యసాయిబాబా త్రాగునీటిపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తోరాటి మాట్లాడుతూ గాదరాడలోని లోతట్టు ప్రాంత ప్రజలకు గత నాలుగు మాసాల నుండి సక్రమమైన త్రాగునీరు, విద్యుత్తు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా బత్తిన మాట్లాడుతూ ఈ సమస్యను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తోరాటి శ్రీనివాస్, పాలం నాగ విష్ణు పాల్గొన్నారు.

**మండలంలోని వార్డులు**

# పోలింగ్ బూత్‌ల తుది జాబితా ప్రదర్శన

**ఎంపీడీవో బత్తిన అశోక్‌కుమార్**



**కోరుకొండ, ఆగస్టు 31, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాల వారిగా ఏ వార్డులో ఎన్నికలు ఏ పోలింగ్ బూత్‌లో జరుగుతాయో తెలియజేసే విధంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు తుది జాబితా మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించడం జరిగిందని కోరుకొండ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ అన్నారు. సోమవారం కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వార్డు, పోలింగ్ స్టేషన్ల వివరాలు తెలియజేస్తూ తుది జాబితాను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా బత్తిన మాట్లాడుతూ గ్రామాల వారీగా వార్డులు, పోలింగ్ స్టేషన్లో వివరాల తుది జాబితా ప్రదర్శించడం జరిగిందని, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తుది జాబితాను తిలకించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సామ్యూల్, పాణి రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

అసలు ఎపిక్ సినిమా అంటే అదే..

# ఆ సీన్‌లో కన్నీళ్లు పెట్టుకున్నా : ఆనంద్ దేవరకొండ





విజయ్ దేవరకొండ సోదరుడు ఆనంద్ దేవరకొండ డిఫరెంట్ సినిమాలతో ఆడియెన్స్ ను అలరిస్తున్నాడు. భిన్నమైన కథలను ఎంచుకుంటూ హిట్స్ కొడుతున్నాడు. త్వరలోనే ఎపిక్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. తాజాగా ఈ సినిమా ప్రమోషయన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. యువ నటుడు ఆనంద్ దేవరకొండ తన రాబోయే చిత్రం ఎపిక్ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆనంద్ మాట్లాడుతూ.. సినిమా టైటిల్ ఎంపికతో మొదలుపెట్టి, తన దృష్టిలో ఎపిక్ అంటే ఏంటి.?, తనను ప్రభావితం చేసిన చిత్రాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఎపిక్ అనే పదం చాలా పవర్ఫుల్ అని, దానిని తమ సినిమా టైటిల్‌గా ఎంచుకోవడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని ఆనంద్ దేవరకొండ వివరించారు. ఈ చిత్రం ఎపిక్: ఆన్ అన్‌ఫినిష్డ్ స్టోరీ అలాగే మోస్ట్ రిలేటబుల్ లవ్ స్టోరీ అనే క్యాప్షన్స్ కలిగి ఉందని, ఇది కథకు ఎంతగానో సరిపోతుందని ఆయన తెలిపారు. సాధారణంగా ఎపిక్ అనే పదాన్ని మనం చాలా అరుదుగా, అసాధారణమైన సందర్భాలలో మాత్రమే వాడతామని ఆనంద్ గుర్తు చేశారు. ఒక సినిమాను ఎపిక్ అని పిలవాలంటే, అది ప్రేక్షకులను ఎంతగానో ప్రభావితం చేయాలని ఆయన అన్నారు. మరి తనను ఒక ప్రేక్షకుడుగా ఏ సినిమాలు ఎపిక్ అనిపించాయి అని అడగగా, ఆయన కొన్ని చిత్రాలను ప్రస్తావించారు. ఒడిస్సీ వంటి చిత్రాలు భారీ స్థాయి కారణంగా ఎపిక్‌గా అనిపిస్తాయని, బాహుబలి వంటి చిత్రాలు పేరులోనే ఎపిక్ అనే అర్థాన్ని కలిగి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే, ఆయన వ్యక్తిగత ఎమోషనల్ గా తాకిన ఒక సినిమా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు ఆ సినిమా సత్యం సుందరం. ఈ సినిమాను తాను రెండు మూడుసార్లు చూశానని, ముఖ్యంగా అందులోని ఒక సైకిల్ సన్నివేశం దగ్గర కన్నీళ్లు పెట్టుకున్నానని తెలిపారు. ఆ సన్నివేశం తనకు ఎంతో నచ్చిందని, అది కేవలం ఒక చిన్న సైకిల్ ఇచ్చిపుచ్చుకునే దృశ్యం కాదని, దాని వెనుక ఉన్న భావోద్వేగం, కృతజ్ఞతా భావం తనను ఎంతగానో కదిలించిందని అన్నారు. ఒక పాత సైకిల్‌ను ఇవ్వడం, దానిని ఎంతో కాలం గుర్తుంచుకోవడం వంటివి జీవితంలో మనం సాధించే గొప్ప విషయాల కంటే కూడా నిజమైన, ఎమోషనలైన "ఎపిక్" క్షణాలని ఆనంద్ అన్నారు. అలాగే ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో కృతజ్ఞతా భావం తగ్గుతున్న ఇలాంటి సమయంలో సత్యం సుందరం వంటి సినిమాలు ఒక చిన్న ప్రేరణను అందిస్తాయని అన్నారు. కొన్నిసార్లు సినిమాలు చూసిన తర్వాత, మనం మారినట్లు, ఏదో నేర్చుకున్నట్లు అనిపిస్తుందని, అది కేవలం నీతిపాఠం కాదని ఆయన వివరించారు. సత్యం సుందరం చూసిన తర్వాత తాను చిన్న విషయాలకు మరింత విలువ ఇవ్వాలని, చిన్న చిన్న క్షణాలను ఆస్వాదించాలని కోరుకున్నట్లు ఆనంద్ దేవరకొండ తెలిపారు. ఈ ప్రభావం కొన్ని రోజులు ఉండవచ్చు, ఆ తర్వాత మనం మళ్ళీ మన దైనందిన జీవితంలోకి వెళ్ళిపోతామని, కానీ అలాంటి సినిమాలు మనకు జీవితంలోని మరో కోణాన్ని చూపిస్తాయని, ప్రాక్టీస్‌తో మనం అలాంటి విలువలను నిలుపుకోవచ్చని ఆయన అన్నారు.

ఆ సినిమాలో నా పాత్రకు ఎప్పటికీ క్రేజ్ తగ్గదు..

# అలాగే మీమ్స్ ఎంత క్యూట్‌గా ఉన్నాయో : నయనతార



హీరోయిన్ నయనతార క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వరుస సినిమాలతో దాదాపు రెండు దశాబ్దాలుగా సినీరంగంలో చక్రం తిప్పుతుంది. ఇప్పటికీ బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో ఫుల్ బిజీగా ఉంది ఈ అమ్మడు. గతంలో ఓ ఇంటర్వ్యూలో నయనతార మాట్లాడుతూ టాలీవుడ్ స్టార్ హీరోల గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. అందాల భామ నయనతార రీసెంట్ గా టాక్సిక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఊహించని విధంగా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. యష్ హీరోగా నటించిన టాక్సిక్ సినిమాకు మొదటి షో నుంచే డివైడ్ టాక్ వచ్చింది. దాంతో ఈ సినిమాపై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయితే నయనతార గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతుంది. ఓ ఇంటర్వ్యూలో నయనతార నటించిన అదుర్స్ చిత్రంలోని చంద్రకళ పాత్ర గురించి ప్రస్తావన వచ్చింది. తెలుగులో తాను అనేక చిత్రాలు చేసినప్పటికీ, చంద్రకళ పాత్రకు మాత్రం ఒక ప్రత్యేకమైన, ఎప్పటికీ తగ్గని క్రేజ్ ఉందని నయనతార అన్నారు. ఈ పాత్రకు సంబంధించిన మీమ్స్ ఇప్పటికీ ఎంతగా ట్రెండ్ అవుతున్నాయో చూపిస్తూ ఇంటర్వ్యూయర్ కొన్ని మీమ్స్‌ను చూపించారు. ఈ మీమ్స్‌లో మిస్టర్ బట్టు చంద్రకళతో ప్రేమలో పడటం అనే అంశం ప్రముఖంగా కనిపించింది. ఆసక్తికరంగా, ఈ మీమ్స్ నయనతార వ్యక్తిగత జీవితంలోని ముఖ్య ఘట్టాలతో ముడిపడి ఉండటం విశేషం. ఆమెకు పెళ్లి అవుతుందని తెలిసినప్పుడు, అలాగే ఆమె పిల్లలు పుట్టిన తర్వాత కూడా చంద్రకళ మీమ్స్ రూపంలో స్పందించడం చూసి నయనతార ఆశ్చర్యపోయారు. ఈ మీమ్స్‌ను తాను ఎప్పుడూ చూడలేదని, అవి ఎంత క్యూట్‌గా ఉన్నాయో అని నవ్వుతూ అన్నారు. వినాయక్ గారు అప్పట్లోనే ఇది చూపించారు అని మీమ్స్ వెనుక ఉన్న క్రియేటివిటీని గుర్తుచేసుకున్నారు. అసలు ఇవన్నీ అప్పట్లో ఫుల్‌గా ట్రెండింగ్‌లో ఉండేవి అని ఇంటర్వ్యూయర్ చెప్పగా, నయనతార "ఓ ఐ డింట్ నో దిస్" అంటూ తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. చివరగా, "బట్టుకి అన్యాయం జరిగిపోయింది" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. మొత్తంగా, ఈ ఇంటర్వ్యూ నయనతార వ్యక్తిగత, వృత్తిగత జీవితంలోని కొన్ని అందమైన క్షణాలను, తన పాత్రలకు ప్రేక్షకుల నుంచి లభించే అనూహ్యమైన ప్రేమగురించి అనేక విషయాలు పంచుకున్నారు.

# ప్రేమకథా చిత్రాలతో ఫేమస్.. ఇప్పుడేమో ఇలా..!




తెలుగులో పలు హిట్ సినిమాల్లో హీరోయిన్ గా నటించిందీ ముద్దుగుమ్మ. తన అందం, అభినయంతో క్రేజీ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఏమైందో తెలియదు కానీ ఉన్నట్లుండి సినిమా ఇండస్ట్రీ నుంచి దూరమైపోయిందీ అందాల తార. చివరిగా 2016లో ఓ సినిమాలో యాక్ట్ చేసిందీ అదాల తార. పై ఫొటోలో ఉన్నదెవరో గుర్తు పట్టారా? ఈమె ఒకప్పుడు తెలుగులో ఫేమస్ హీరోయిన్. మరీ వందల కొద్దీ సినిమాలు చేయకపోయినా ఉన్నంతలో మంచి సినిమాలే చేసింది. హీరోయిన్ గా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. 1991లో విడుదలైన హిందీ సినిమా లమ్హేలో బాలనటిగా సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 2000లో ఓ తెలుగు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఈమె నటించిన మొదటి సినిమానే ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. తన ఫొటోస్, వీడియోలను ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేస్తూ ఫ్యాన్స్ కు టచ్ లో ఉంటోంది. అలా తాజాగా తన 46వ పుట్టిన రోజు సెలబ్రేషన్స్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. మరీ ఈ హీరోయిన్ ఎవరో గుర్తు పట్టారా? ఆమె మరెవరో కాదు 'నువ్వే కావాలి' సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించిన హీరోయిన్ రిచా. దీంతో పాటు హోలీ, నా మనసిస్తారా, పెళ్లాం పిచ్చోడు, ఇంకోసారి తదితర తెలుగు సినిమాల్లోనూ నటించిన ఈముద్దుగుమ్మ 2016 తర్వాత వెండితెరకు పూర్తిగా దూరమైంది.




ఆ ఒక్క తప్పుతో చేజారిన సెంచరీ..

# వైభవ్ సూర్యవంశీ సిక్సర్ షాట్ వైరల్



దిలీప్ ట్రోఫీ 2026 సెమీఫైనల్‌లో వైభవ్ సూర్యవంశీ 81 బంతుల్లో 92 పరుగులతో అదరగొట్టాడు. 7 ఫోర్లు, 7 సిక్సర్లతో విరుచుకుపడిన ఈ యువ బ్యాటర్ సెంచరీకి చేరువలో హర్ష్ దూబె బౌలింగ్‌లో భారీ సిక్సర్ ప్రయత్నించి అవుటయ్యాడు. అద్భుత ఇన్నింగ్స్‌తో వైభవ్ మరోసారి దేశవాళీ క్రికెట్‌లో తన సత్తా చాటాడు. ఈ షాట్ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. దిలీప్ ట్రోఫీ 2026 మొదటి సెమీఫైనల్‌లో ఈస్ట్ జోన్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 92 పరుగుల వద్ద అవుటయ్యాడు. సెంట్రల్ జోన్‌పై 7 ఫోర్లు, 7 సిక్సర్లతో విరుచుకుపడి రికార్డు హాఫ్ సెంచరీ బాదిన ఈ కుర్రాడు, మరో సిక్సర్ కొట్టే క్రమంలో సెంచరీకి ముందే వెనుతిరిగాడు. బెంగళూరు వేదికగా జరుగుతున్న ఈ పోరులో ఈస్ట్ జోన్ తరఫున బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ ఆరంభం నుంచే సెంట్రల్ జోన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కట్ షాట్లు, హుక్స్, కవర్ డ్రైవ్‌లతో మైదానం నలుమూలలా పరుగుల వరద పారించాడు. కేవలం 42 బంతుల్లోనే ఒక భారీ సిక్సర్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని, దిలీప్ ట్రోఫీ చరిత్రలోనే హాఫ్ సెంచరీ సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా వెనకడుగు వేయకుండా బౌండరీల వేట కొనసాగించాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఒక షార్ప్ అవుట్‌స్వింగర్ వల్ల క్యాచ్ అవకాశాన్ని తృటిలో తప్పించుకున్న వైభవ్, 40 పరుగుల వద్ద ఉన్నప్పుడు మరో గోల్డెన్ ఛాన్స్ పొందాడు. పాయింట్ దిశలో యశ్ రాథోడ్ ఒక ఈజీ క్యాచ్‌ను నేలపాలు చేయడంతో వైభవ్‌కు లైఫ్ దక్కింది. ఈ అవకాశాన్ని నిరోధకంగా ఆడటానికి కాకుండా, ప్రత్యర్థి బౌలర్లపై మరింత ధాటిగా విరుచుకుపడేందుకు ఒక అవకాశంగా మార్చుకున్నాడు. రివర్స్ స్వీప్‌లు, లాంగ్ ఆన్ మీదుగా భారీ సిక్సర్లు బాదుతూ ప్రేక్షకాభిమానులను అలరించాడు. డ్రింక్స్ విరామం సమయంలో ఈస్ట్ జోన్ డగ్ అవుట్ నుంచి వచ్చిన సూచనల మేరకు వైభవ్ తన ఆవేశాన్ని కాస్త తగ్గించుకునే ప్రయత్నం చేశాడు. శరీరం వద్దకు వచ్చే బంతులను ఆడుతూ, బయటకు వెళ్లే బంతులను వదిలేస్తూ ఎనిమిది బంతుల పాటు సంయమనం పాటించాడు. వర్షం కారణంగా ఆట కాసేపు నిలిచిపోయిన తర్వాత, బౌలర్ హర్ష్ దూబె అరౌండ్ ద వికెట్ బౌలింగ్ చేస్తూ వైభవ్‌ను కట్టడి చేసేందుకు మంచి ప్లాన్ వేశాడు. రెండు బంతులు ఓపిక పట్టిన ఈ యువ కిరణం, మూడో బంతికి క్రీజు దాటి వచ్చి లాంగ్ ఆన్ పైనుంచి భారీ సిక్సర్ బాదాడు. సెంచరీ అత్యంత సమీపంలోకి వచ్చిన వేళ, సహజ సిద్ధమైన దూకుడు వైభవ్ నిర్ణయాన్ని శాసించింది. హర్ష్ దూబె వేసిన బంతిని ముందుకు వచ్చి మరోసారి భారీ సిక్సర్‌గా మలచాలని ప్రయత్నించాడు. బంతి బ్యాట్ సరిగ్గా కనెక్ట్ కాకపోవడంతో డీప్ మిడ్‌వికెట్‌లో కాచుకుని ఉన్న ఫీల్డర్ అర్షద్ ఖాన్ చేతిలో సులభంగా పడింది. దీంతో 81 బంతుల్లో 92 పరుగులు చేసిన వైభవ్ అద్భుత ఇన్నింగ్స్ ఒక చిన్న పొరపాటుతో ముగిసింది. సెంచరీ చేజారినప్పటికీ వైభవ్ సూర్యవంశీ ఆడిన ఈ ఇన్నింగ్స్ దేశవాళీ క్రికెట్‌లో తనను నెక్ట్స్ లెవల్ కు తీసుకెళ్లింది.

ఏంది భయ్యా ఈ ఆట.. 225 బంతులు.. 7 ఫోర్లు..

# ఒక్క సిక్సర్ లేకుండానే సెంచరీ కొట్టిన తిలక్ వర్మ




దిలీప్ ట్రోఫీ 2026 సెమీఫైనల్‌లో తిలక్ వర్మ తన బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. సిక్సర్లు లేకుండానే 225 బంతుల్లో 7 ఫోర్లతో 106 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్‌గా బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడి సౌత్ జోన్‌కు 90 పరుగుల ఆధిక్యం అందించాడు. నార్త్ జోన్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ అద్భుతమైన డిఫెన్స్‌తో సెంచరీతో సాధించాడు. దిలీప్ ట్రోఫీ 2026 రెండో సెమీఫైనల్ పోరులో సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత సెంచరీతో మెరిశాడు. నార్త్ జోన్ బౌలర్ల పదునైన బంతులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, అత్యంత బాధ్యతాయుతమైన డిఫెన్సివ్ గేమ్‌తో 106 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ 90 పరుగుల కీలక ఆధిక్యాన్ని సాధించింది. తిలక్ వర్మ ఈ మ్యాచ్‌లో తన శైలికి భిన్నంగా పూర్తి నియంత్రణతో కూడిన డిఫెన్సివ్ ఆటకే ప్రాధాన్యమిచ్చాడు. సౌత్ జోన్‌ను ఒంటిచేత్తో నడిపించే క్రమంలో 225 బంతులను ఎదుర్కొని 7 ఫోర్లతో 106 పరుగులు చేసి క్రీజులో నాటౌట్‌గా ఉన్నాడు. ఈ ఇన్నింగ్స్ పొడవునా ఒక్క సిక్సర్ కూడా కొట్టకపోవడం ఆయన క్రమశిక్షణకు, పరిణతికి నిదర్శనం. 47.11 స్ట్రైక్ రేట్‌తో సాగిన ఈ సుదీర్ఘ పోరాటం సౌత్ జోన్‌ను పటిష్ట స్థితికి చేర్చడంలో కీలక పాత్ర పోషించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న నార్త్ జోన్‌ను సౌత్ జోన్ బౌలర్లు తీవ్రంగా ఒత్తిడిలోకి నెట్టారు. పదునైన లైన్ అండ్ లెంగ్త్‌తో విరుచుకుపడి ప్రత్యర్థిని తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 195 పరుగులకే ఆలౌట్ చేశారు. సౌత్ జోన్ బౌలర్లలో విద్వత్ కావేరప్ప 4 వికెట్లతో చెలరేగగా, నిధీష్, తనయ్ త్యాగరాజన్ తలో 2 వికెట్లు తీశారు. కావూరి సాయితేజ, శ్రేయస్ గోపాల్‌లకు చెరో వికెట్ లభించింది. వికెట్లు వరుసగా పడటంతో నార్త్ జోన్ తక్కువ స్కోరుకే కుప్పకూలాల్సి వచ్చింది. నార్త్ జోన్ తక్కువ స్కోరుకే పరిమితమైనప్పటికీ వారి బౌలర్లు గట్టి పోటీ ఇచ్చారు. శ్రీలంక పర్యటన ముగించుకుని నేరుగా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగిన వేగవంతమైన బౌలర్ గుర్‌నూర్ బ్రార్ సౌత్ జోన్ బ్యాటర్లను వణికించాడు. ఇప్పటికే 4 వికెట్లు పడగొట్టి ఐదు వికెట్ల ఫైఫర్ మైలురాయికి చేరువలో ఉన్నాడు. నక్షత్ర బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, అంశుల్ కంబోజ్ తలో రెండు వికెట్లు తీసి సౌత్ జోన్ వికెట్లను క్రమంగా పడగొట్టారు. ఒక రన్ అవుట్‌తో కలిపి సౌత్ జోన్ 285 పరుగులకు 9 వికెట్లు కోల్పోయింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 94 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. ప్రస్తుతం తొలి ఇన్నింగ్స్ ప్రాతిపదికన సౌత్ జోన్ 90 పరుగుల ముందంజలో ఉంది. క్రీజులో తిలక్ వర్మ సురక్షితంగా ఉండటంతో మూడో రోజు ఆరంభంలో ఈ ఆధిక్యాన్ని మరింత పెంచుకునే అవకాశం సౌత్ జోన్‌కు దక్కింది. ఒత్తిడి ఉన్నప్పుడు కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి జట్టును ముందుకు నడిపిన తిలక్ వర్మ ప్రదర్శన క్రికెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. మూడో రోజు ఆటలో నార్త్ జోన్ పుంజుకుంటుందో లేక తిలక్ వర్మ సౌత్ జోన్ ఆధిక్యాన్ని మరింత పెంచుతాడో చూడాలి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com